
జన్మదిన శుభాకాంక్షలు
స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు గారు
మాజీ మంత్రివర్యులు
ప్రజలు మెచ్చిన నేతగా
తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొంది
రాజకీయాలలో ఘనాపాటిగా ముద్ర వేసుకొని
తనను నమ్మిన వారికి తాను ఉన్నానని భరోసా కల్పిస్తూ
అంచెలంచెలుగా ఎదుగుతూ
స్వర్ణాంధ్ర రూపకర్త శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవలు అందిస్తున్న
మా అద్దంకి ముద్దుబిడ్డ
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మున్ముందు మరెన్నో
జన్మదిన వేడుకలు జరుపుకోవాలని
మనస్ఫూర్తిగా
కోరుకుంటూ...
మీ...
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖమాత్యులు
కామేపల్లి లక్ష్మీప్రసాద్
కామేపల్లి గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్సు
జొన్నతాళి, మార్టూరు మండలం
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు





బాపట్ల రూరల్ పరిధిలో బధిరుల పాఠశాల వెనుక జరుగుతున్న ఇసుక తవ్వకాలు(ఫైల్‌ఫొటో)

ఉచితమని వస్తే ఊరుకోం



తెనాలి: కొల్లిపర వద్ద ట్రాక్టర్లకు ఇసుక ఎత్తుతున్న కూలీలు

ఇసుక ఉచితం.. ప్రభుత్వం ప్రకటించింది.. ముఖ్యమంత్రి చెప్పారు.. అని వస్తే ఊరుకునేది లేదు. మా ఇసుక. మా ఇష్టం.. అంటూ రీచ్‌ల వద్ద నేతలు, ఇసుక అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం.. నేతలకు, అక్రమార్కులకు వరంగా మారింది. సీఎం చెప్పినట్లుగా సొంత అవసరాల కోసం రీచ్‌ల వద్దకు వెళ్తే అక్కడి వారి దౌర్జన్యాలు, బెదిరింపులకు బలికావాల్సి వస్తోంది. సీఎం చెప్పారు మీరేందని ఎదురు తిరిగితే నదిలోకి దిగితే పాతరేస్తామని తెనాలి పరిధిలోని రీచ్‌ల వద్ద కొందరు బరితెగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా ఉచిత ఇసుక అమలు కావడంలేదు. వైసీపీ హయాంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నేతలు ఇసుక పేరుతో కాసులు పోగేసుకుంటున్నారు. ఇసుక అక్రమాల విషయంలో గత వైసీసీకి, ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద తేడాలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. సామాన్యులు ఇబ్బంది పడకుండా ఇసుక తెచ్చుకునేందుకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దందా చేస్తున్నారు. మరోవైపు మరికొందరు పంచాయతీ, పోలీసుల పేరుతో అధికార దందా సాగిస్తున్నారు.

- రీచ్‌ల వద్ద నేతల బెదిరింపులు
- నదీ మార్గంలో గండికొట్టి మరీ దౌర్జన్యం
- నగదు ఇవ్వకుంటే ట్రాక్టర్ దిగనివ్వని వైనం
- అధికారం మారినా కొనసాగుతున్న ఇసుక దందా
- పట్టించుకోని అధికారులు.. యథేచ్ఛగా అక్రమాలు
- అక్రమార్కులకు వరంగా మారిన ప్రభుత్వ వెసులుబాటు

- నదిలోకి ట్రాక్టర్ దిగాలంటే రూ.500 కట్టాలి.
- అందరికంటే ముందు లోడ్ చెయ్యాలంటే రూ.600 అదనం.
- బయటి నుంచి వచ్చిన ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లిస్తేనే ఇసుక.
- పంచాయతీల్లో జరిగే రోడ్ల నిర్మాణానికి ఇసుక కావాలంటూ పంచాయతీ కార్యదర్శుల పేరు, కార్యాలయ స్టాంప్‌తో లేఖలు
- పోలీస్‌నంటూ రాత్రుళ్లు రెండు లారీలతో ఇసుక తరలింపు
- పల్నాడు జిల్లాల్లో రాత్రిళ్లు వందల కొద్దీ లారీలతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ



తెనాలి: అరవింద వారధి దగ్గర పెదలంక వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

బాపట్ల, తెనాలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు అవుతున్న ఉచిత ఇసుక విధానం. ఇసుక సామాన్యుల కు కూడా సులభంగా అందుబా టులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తూ.. ఇసుకలో నేతలు, వారి అనుచరులు జోక్యం చేసుకోవద్దని హెచ్చరిస్తున్నా ఆలకించే వారే లేరు. ఇసుక అక్రమ సంపాదనకు రుచిమరిగిన అక్రమార్కులు మాత్రం ఇంకా కాసులు దోచేస్తూనే ఉన్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువున, దిగువున ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల సొంత అవసరాల కోసం నేరుగా రీచ్‌ల వద్దకు వచ్చి ఇసుకను తవ్వి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వగా ఇదే అవకాశంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకల్లో మాత్రమే స్థానికులు తమ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంటే అసైన్డ్, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు తెగబడి సొమ్ము చేసుకుంటున్నారు. సొంత అవసరాలకు ఇసుక కోసం ముందస్తు అనుమతి తీసుకుని పర్మిట్ ఉండాలని నిబంధన ఉన్నా వాటిని పట్టించుకునే వారే లేరు. ఈ తవ్వకాల వెనక కీలకంగా వ్యవహరిస్తున్నది పాలకపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణమే కావడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు వేస్తున్నారు. పల్నాడు జిల్లాల్లో అయితే రాత్రిళ్లు వందల కొద్దీ లారీల్లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో ఎత్తి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాట రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతి లేకపోయినా నేతల ఘరానా దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. చాలాచోట్ల గత ప్రభుత్వంలో ఇసుక దందా నడిపిన వైసీపీ నాయకులు, వారి అనుచరులే మళ్లీ అక్రమాలకు పాల్పడుతుంటే, మరికొన్నిచోట్ల కూటమి నేతల పేరుచెప్పి వారి అనుచరులు ఇసుక దందాకు తెరతీస్తున్నారు. తాడేపల్లి మండలం మొదలు రేపల్లె మండలం వరకు కృష్ణా తీరంలో ఇసుక దందాకు అడ్డేలేకుండా పోతోంది. బ్యారేజి దిగువున గుంటూరు జిల్లాలో చిర్రావూరు, గుండిమెడ, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, వల్లబాపురం, మున్నంగి, కొల్లిపర, బొమ్మువానిపాలెం, చిలుమూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, ఓలేరు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిలో మూడింటికి మాత్రమే మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. మిగిలినవాటిలో స్థానిక కూటమి, వైసీపీ నేతలు హవా కొనసాగిస్తూ వసూళ్ల దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల డబ్బు కట్టకుంటే వాహనాలు నదిలోకి దిగడానికి వీలులేదంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్న పరిస్థితులూ ఉన్నాయి. రీచ్‌ల వద్ద ఉన్న వారు అడిగినట్లు నగదు ఇవ్వకుంటే నదిలోకి దిగనివ్వమంటూ అడ్డుకుంటున్నారు. కొన్ని దగ్గర్ల ఇతరుల వాహనాలు నదిలోకి దిగే గాలు మార్గానికి గుంతలతో గండ్లు కొట్టేస్తున్నారు. కొల్లూరు మండలం పెసర్లంక, గాజుల్లంక, చిలుమూరు దగ్గర అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానుల నుంచి కూడా జనసేన, టీడీపీ నాయకులు రూ.500 కప్పం వసూలు చేస్తున్నట్లు సమాచారం. అరవింద వారధి దగ్గర డబ్బు కట్టకుండా ట్రాక్టర్లు లోనికి దిగుతున్నాయని వారం క్రితం ఎక్స్‌కవేటర్‌తో గొయ్యి తవ్వించేశారు.

హెచ్చరించినా.. తగ్గేదిలేదు..

బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, అత్తలూరివారిపాలెం తదితర రీచ్‌ల వద్ద పక్షం రోజుల క్రి తం వరకు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేశారనే ఆరోపణలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ పరిశీలించారు. ట్రాక్టర్‌కు రూ.600 మించి వసూలు చేయరాదని, అంతకు మించి వసూ లు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అయినా మరికొన్ని అడ్డదారులు సృష్టించుకుని వసూ ళ్లు మాత్రం ఆపలేదు. ఇసుక రీచ్‌లు ఉండే గ్రామాల పరిధిలోని ట్రాక్టర్‌లకు రూ.500 అ దనంగా వసూలు చేస్తుంటే, బయట ప్రాంతాల నుం చి ఇసుక కోసం వచ్చే ట్రాక్టర్‌లకు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ముందుగా లోడింగ్ కావాలంటే అదనంగా రూ.600 చెల్లిస్తే కూ లీలే ఆ వాహనం దగ్గరకు వెళ్లి ఇసుక లోడ్ చేస్తున్నారు.

పంచాయతీల పేరుతో..


గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో జరిగే నిర్మాణ అవసరాలకు ఇసుకకు ప్రత్యేక అనుమతి ఉంది. ఆయా పనుల వివరాలతో పంచాయతీ తీర్మానం చేసి దాని ఆధారంగా కార్యదర్శి లేఖను ఇస్తే ఆ మండల తహసీల్దార్ సిఫార్సుతో ఇసుక లోడ్ చేసుకోవచ్చు. లేదంటే పంచాయతీరాజ్ ఏఈ లేఖ ఇచ్చినా సరిపోతుంది. అయితే కొన్ని రీచ్‌ల వద్ద నేరుగా పంచాయతీ కార్యదర్శుల పేరు, స్టాంప్‌తో చేతిరాతతో ఉన్న లేఖలను చూపి వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ లేఖలు అసలా, నకిలీనా అంటే సమాధానం చెప్పేవారు పరిశీలించే వారే లేరు. నిజాంపట్నం, కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి, బాపట్ల మండలాల్లోని పంచాయతీల పేరుతో లేఖలు ఎక్కువగా వస్తున్నాయి. పంచాయతీ లేఖ ఉందని పోలీసులూ కూడా వాటిని వదిలేస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులకు కాసులు పండుతున్నాయి.

బుసక పేరిట తమ్ముళ్ల మేత

ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికలు, ఇసుక తవ్వకాలకు నిబంధనలను పట్టించుకోకుండా కొందరు నేతలు అధికారిక దందా చేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు అడ్డుకుంటే తాము తవ్వుతున్నది ఇసుక కాదని బుసక అని అక్రమార్కులు ఎదురుదాడికి దిగుతున్నారు. బుసక అయినా అనుమతులు ఉండాలన్నా పట్టించుకోవడవడంలేదు. బాపట్ల జిల్లాలో చీరాల, వేటపాలెం, చినగంజాం, బాపట్ల రూరల్ మండలాల పరిధిలో అక్రమార్కులు ఏకంగా ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఇటీవల చీరాల టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే వారిపైనే అక్రమార్కులు ఎదురుదాడికి దిగారు. బాపట్ల రూరల్ పరిధిలోని బధిరుల పాఠశాల వెనక అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ పరిధిలో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారీతిన జరుపుతున్నారు. అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతలే ఇసుక అక్రమ తవ్వకాల వెనుక ఉండటంతో కొందరు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారు. బాపట్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఇసుక భూముల్లో పది నుంచి 15 అడుగుల వరకు లోతుపెట్టి మరీ తవ్వేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్మేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులంతా బాపట్లలో ఉన్నా అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుంది.

దుగ్గిరాల కానిస్టేబుల్‌నని చెప్పి..

దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర గత వారం నుంచి ఓ వ్యక్తి తాను దుగ్గిరాల కానిస్టేబుల్‌ననిచెప్పి ఏకంగా లారీలతోనే ఇసుకను తరలించేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పెదకొండూరు రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుంటే బిల్లులు చూపాలని దౌర్జన్యం చేసి, అనుమతి లేని ట్రాక్టర్లను అడ్డుకుని లారీల్లో తమతోనే ఇసుక లోడ్ చేయించుకెళ్తున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. అయితే అతడు నిజంగా పోలీసా! లేక ఆ పేరుచెప్పి దౌర్జన్యానికి పాల్పడుతున్న నకిలీనా అనేది తేలాలి. దీనిపై తెనాలి రూరల్ పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే మాత్రం తమ కానిస్టేబుల్ ఎవరూ రారని, ఒకవేళ ఎవరైనా కానిస్టేబుల్ పేరుచెప్పి ఇసుక దందాకు సిద్ధపడితే సమాచారం ఇవ్వాలన్నారు.





నిబంధనలు పాటించకుంటే కేసులు

- బెల్ట్ నిర్వాహకులపై 87 కేసుల నమోదు
- దుకాణదారులకు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరిక

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేకుంటే కేసుల నమోదుకు వెనుకాడబోమని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. బాపట్లలోని ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు 87 కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. నిరంతర తనిఖీలలో భాగంగా నాటుసారా అమ్ముతున్న 28 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం పేర్కొన్న ధరలకే మద్యం అమ్మాలని, ఇలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ దేవదత్తు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు జనార్ధనరావు, వెంకటేశ్వరరావు, సీఐ గీతిక పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ



అపోలో డెంటల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీపురం ఒకటవ లైనులో గల అపోలో డెంటల్ హాస్పిటల్‌లో రోగులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రోగులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డుపై ఉచితంగా దంత చికిత్సలు అందిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 8926378378లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కబడ్డీ టోర్నమెంట్ ఎంపిక

పిట్టలవానిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 9, 10, 11 తేదీలలో రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ , సెలక్షన్స్ కార్యక్రమాలు జరుగుతాయని బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడురోజులపాటు జరిగే స్కూల్‌గేమ్స్ క్రీడలలో భాగంగా అండర్-14 కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరి ఎం.ప్రశాంత్‌బాబు పర్యవేక్షణలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించబడుతాయని వారు తెలిపారు. ఈ కబడ్డీ పోటీలకు సుమారు 500మంది క్రీడాకారులు, కోచ్‌లు, ఏపిలోని 13జిల్లాలు నుండి క్రీడాకారులు హాజరవుతారని వారు తెలిపారు.

పేద మహిళకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని అబ్దుల్ ఫౌండేషన్ ద్వారా ప్రతి శుక్రవారం పేద మహిళకు బియ్యం, నిత్యవసర సరుకులు అందజేస్తున్నామని కర్లపాలెం ఉపసర్పంచ్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. ముస్లిం నిరుపేద మహిళకు శుక్రవారం బియ్యం, నిత్యవసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ మస్తాన్‌వలి, షేక్ ఇబ్రహీం, షేక్ బహదూర్‌బాషా, షేక్ జిలానీ, రియాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ధర్నాకు పిలుపు

బాపట్లరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై నవంబరు 11న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు, కార్యకర్తలకు జెబి.శ్రీధర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును తిరిగి పునరుద్ధరించాలని, 3,200 క్లైమ్‌లు వెంటనే పరిష్కరించాలని, భవననిర్మాణానికి ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, పట్టణ నాయకులు మామిడి బత్తుల అశోక్, ఫణేంద్ర పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన గ్రామస్థులు


అమృతలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖలో పని చేస్తూ పదోన్నతి పొందిన ఇద్దరు సిబ్బందిని గ్రామస్థులు సత్కరించారు. మండల పరిధిలోని ప్యాపర్రులో గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న బుద్దా మణికంఠ వ్యవసాయవిస్తరణాధికారిగా శుక్రవారం పదోన్నతి పొందాడు. గతంలో అమృతలూరు వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేసిన అవ్వారు మహేష్ పదోన్నతిపై వ్యవసాయ అధికారిగా పదోన్నతి పొందారు. దీంతో మండలంలోని ప్యాపర్రు రైతు భరోసా కేంద్రంలో ఇద్దరిని సన్మానించారు. కార్యక్రమంలో ఏవో లోకేశ్వరి, సర్పంచ్ జి.హేమచంద్ర శ్రీనివాస్, గ్రామ టీడీపీ నాయకులు అచ్చన వెంకటేశ్వరరావు, వన్నా బెనర్జీ పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● బాపట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.గీతిక



బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం అధిక ధరలకు విక్రయించినా, బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతిక తెలిపారు.



ప్రశ్న : నియోజకవర్గంలో ఎన్ని మద్యం దుకాణాలకు పర్మినెంట్ లైసెన్స్‌లు ఇచ్చారు?

సీఐ : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో 19 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో 19 మంది లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారు. 18 దుకాణాలకు పర్మినెంట్ లైసెన్స్‌లు వచ్చాయి. మరొకదానికి ఇవ్వనున్నాం.

ప్రశ్న : ఒక ప్రాంతంలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు?

సీఐ : ఒక ప్రాంతంలో ఎన్ని దుకాణాలైనా ఏర్పాటు చేసుకోవచ్చు. బాపట్ల పట్టణంలో 7, మండలంలో 4, కర్లపాలెం మండలంలో 4, పిట్టలవానిపాలెం మండలంలో 4 దుకాణాలు చొప్పున ఏర్పాటు చేసుకున్నారు.

ప్రశ్న : బెల్ట్‌షాపులపై చర్యలేమిటి..?

సీఐ : నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎక్కడ బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయలేదు. ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలి. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న : అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై చర్యలేమిటి?

సీఐ : మద్యం దుకాణాలలో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అలాంటివి ఏమి జరగలేదు. జరగకుండా చూస్తాం.

ప్రశ్న : పర్మినెంట్ లైసెన్స్‌కు ఏమికావాలి?

సీఐ : మద్యం దుకాణం నిర్వహించేవారు పర్మినెంట్ లైసెన్స్ కొరకు డిక్లరేషన్, అద్దె అగ్రిమెంట్, కౌంటర్‌పార్ట్ అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారంటీ వంటివి తప్పనిసరిగా ఇవ్వాలి.

సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారుల కసరత్తు



బాపట్లనియోజకవర్గంలో తీరప్రాంత గ్రామాలకు సాగునీరు అందించే ఫిటిఛానల్

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆయుకట్టు భూముల రైతుల వివరాలను ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఆయుకట్టుదారులందరికి ఓటుహక్కు ఉంటుంది. ఓటుహక్కు కల్పించే ప్రక్రియను ప్రారంభించాలంటూ ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులను కోరారు. నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే ఓటర్ల జాబితా అందుబాటులోకి తెచ్చేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని సముద్రతీరప్రాంత గ్రామాలకు సాగునీరు అందించే ప్రధానమైనది ఫిటిఛానల్. ఈ ఛానల్ కింద 48డిసి సంఘం ఉంది. ఈసంఘానికి సంబంధించి 8 సాగునీటి సంఘాలు ఉంటాయి. కాకుమాను మండలంలోని అప్పాపురం, రేటూరు సంఘాలతోపాటు ఈస్ట్‌బాపట్ల, గణపవరం, కర్లపాలెం-1, 2,పేరలి-1, 2 సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘానికి 12 మంది టిసి మెంబర్స్ ఉంటారు. అందులో ఒకరు ప్రెసిడెంట్‌గా మరొకరు వైస్ ప్రెసిడెంట్‌గా ఉంటారు. మిగిలిన 10 మంది సభ్యులుగా ఉంటారు. 8 సాగునీటి సంఘాల పరిధిలోని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లు కలిపి మొత్తం 16 మంది డిస్ట్రిబ్యూషన్‌కమిటీ (డిసి)ని ఎన్నుకుంటారు. ఈ కమిటీలో డీసీ ప్రెసిడెంట్, డీసీ వైస్ ప్రెసిడెంట్‌లు ఉంటారు. ఈవిధంగా అన్నిసంఘాలకు ఎన్నికలు నిర్వహించి డీసీ కమిటీలు ఎన్నుకోనున్నట్లు ఇరిగేషన్ ఏఈ జి.వెంకటరమణ తెలిపారు.

అన్నప్రసాద వితరణ అదృష్టంగా భావిస్తా

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్



అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దీక్షాపరులైన స్వాములకు అన్నప్రసాద వితరణ చేయటం అదృష్టంగా భావిస్తానని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని శ్రీ గంగాపార్వతిసమేత శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గత 19 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి భక్తులకు అన్నం సతీష్ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి దీక్షాపరులకు 41 రోజులపాటు చద్ది అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అయ్యప్పస్వామికి విశేష పూజలు చేసి అయ్యప్ప, భవానీ, శివస్వాములకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొటికం సుబ్బారావు గురుస్వామి, పెద్ది సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం

● అనుమతి లేదంటూ దిమ్మె తొలిగించిన పోలీసులు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో మాజీ మంత్రి, మాజీ గవర్నర్ కోనప్రభాకరరావు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేసేందుకు వైసీపీశ్రేణులు గురువారం అర్ధరాత్రి పనులు ప్రారంభించారు. దీని గురించి తెలుసుకున్న టీడీపీ శ్రేణులు విగ్రహం ఏర్పాటు చేయటానికి వీలులేదంటూ అభ్యంతరం పెట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జాని అక్కడకు వచ్చి పరిశీలించారు. అనుమతులు లేకుండా విగ్రహ దిమ్మె ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు? గతంలో ఇక్కడ ఉన్న విగ్రహాన్ని రోడ్డు విస్తరణ సమయంలో తొలిగించామని తిరిగి అదేప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నామని ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, దివ్యాంగుల జిల్లా నాయకుడు చల్లా రామయ్య వివరించారు. కమిషనర్ దగ్గర నుంచి అనుమతి తీసుకున్నట్లు లెటర్ ఉంటే చూపించమని సీఐ కోరారు. కొత్తబస్టాండ్‌లో మంతెన వెంకటరామరాజు విగ్రహం పెట్టినప్పుడు ఏమిచేశారని, మున్సిపల్ కార్యాలయం దగ్గర మరో విగ్రహం పెట్టటానికి దిమ్మెకడితే ఆటంకం పరచనివారు ఇప్పుడు తమను కావాలనే ఇబ్బందిపెడుతున్నారని ఆందోళన చేశారు. దీనికి ఒప్పుకొని టీడీపీ నాయకులు దగ్గుమల్లి కిరణ్‌కుమార్, చింతాకిషోర్‌లు తొలిగించాల్సిందేనని అనుమతులు ఉంటేనే ఏర్పాటు చేసుకోవాలని చెప్పటంతో సీఐ ఆగ్రహించి కట్టిన దిమ్మెను తొలిగించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనలో తన ఆరోగ్యం దెబ్బతిందని చల్లా రామయ్య ఏరియా వైద్యశాలలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి తదితరులు ఆసుపత్రికి వెళ్ళి రామయ్య ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని వివరణ కోరగా రోడ్డు విస్తరణకు విగ్రహాలు తొలిగించినప్పటికి హైవేరోడ్డు డివైడర్‌పై విగ్రహాలు పెట్టాలంటే కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు.



కట్టిన దిమ్మెను తొలిగిస్తున్న కార్మికులు, పరిశీలిస్తున్న సీఐ

మహిళా డిగ్రీకళాశాల విద్యార్థినుల క్షేత్ర పర్యటన

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలు శుక్రవారం క్షేత్ర సందర్శనకు వెళ్ళారు. అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి వ్యవసాయ కళాశాలను సందర్శించారు. అక్కడ వర్మికంపోస్ట్, కల్టివేషన్ యూనిట్, హార్టికల్చర్, మందుమొక్కల ఉద్యానవనాలను సందర్శించారు. పుట్టగొడుగుల పెంపకం, వర్మికంపోస్ట్ తయారి, వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగమణి, డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ గౌవరి, డాక్టర్ సుశీలవతి, వెంకటలక్ష్మీ, కెవి.వసంత, ఎం.నైమిశా, నాగమల్లేశ్వరి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

కూటమిశ్రేణులమంతా ఐక్యంగా ఉన్నాం : నామన

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి శ్రేణుల మధ్య ఎలాంటి విబేధాలు లేవని, తామంతా ఐక్యంగా ఉన్నామని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తెలిపారు. జనసేన కార్యాలయంలో శుక్రవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యలంక సముద్రతీరంలో ఫ్లెక్సీ తొలిగించారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవంలేదన్నారు. కార్యకర్తలు చేసేపనులు కూటమికి మచ్చతెచ్చేవిధంగా ఉండరాదన్నారు. కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు చేసే అత్యుత్సాహం ఎమ్మెల్యే నరేంద్రవర్మకు ఆపాదించటం సరికాదన్నారు. ఈనెల 15న కార్తీకపౌర్ణమి రోజు సూర్యలంక సముద్రతీరంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, చిల్లా సత్యనారాయణ, ఏసోబు, ధర్మారావు, వెంకటాద్రి, సాయిమురళీ, రాజేంద్ర, దాదా, అన్సారి, సాయిబాబు, నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

క్యారీ బ్యాగ్‌ల వినియోగాన్ని అరికట్టాలి

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని బాపట్ల పౌరసమైక్య సంస్థల ప్రతినిధులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని కలిసి వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ తగుచర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పౌర సమైక్య అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కార్యదర్శి కె.రమణకుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌బోస్, కోశాధికారి జి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'దళిత యువకుడిపై దాడి దారుణం'

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో మూగ, చెవిటి దళిత యువకుడిపై ఆ ప్రాంతానికి చెందిన కొందరు మూకుమ్మడిగా దాడి చేసి కులంపేరుతో దూషించటం దారుణమని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఏరియావైద్యశాలలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడిని శుక్రవారం పరామర్శించిన దళితనాయకులు మాట్లాడుతూ మంచినీళ్ళు తీసుకొని వస్తూ రోడ్డుపక్కనే మూత్ర విసర్జన చేస్తుండగా దివ్యాంగుడిని ఆప్రాంతంలోని యార్లగడ్డ వెంకయ్య కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసి కొట్టారని, అడగటానికి వెళ్ళిన క్షతగాత్రుడు అమ్మమ్మపై కూడా దాడి చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు అధికారప్రతినిధి శీలంరోజన్‌బాబు, బహుజనసమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావు తదితరులు ఉన్నారు. కాగా ఈ దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గంగాధర్ తెలిపారు.

యూబీఐ విశ్రాంత క్యాషియర్ రామచంద్రరావు మృతి

కర్లపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత క్యాషియర్ వాకా రామచంద్రరావు గురువారం రాత్రి ఆయన గృహంలో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ మెండు మహేంద్రభాస్కరరావు, యూనియన్‌బ్యాంక్‌సిబ్బంది శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది రాజమోహన్‌రెడ్డి, జగదీష్‌కుమార్, మల్లేశ్వరరావు, మూర్తి, జనక మహరాజు, మేనేజర్ మానసా తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరణ యంత్రాలను పరిశీలించిన బాపట్ల, పర్చూరు ఎమ్మెల్యేలు



వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, సాంబశివరావు

బాపట్ల రూరల్, నవంబరు 08 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావులు అక్కడ ఆధునీక యంత్రపరికరాలను పరిశీలించారు. అదేవిధంగా సాగులో ఆధునీక పద్ధతులను అక్కడ ఉన్నవారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యూజిలాండ్ ఇంధన శాఖా మంత్రి సిమియాన్‌బ్రౌన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రవాస భారతీయులు ఉన్నారు.

వ్యవసాయ పథకాలు రైతులకు వివరించాలి

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న వ్యవసాయ పథకాలు గురించి వివరించాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయకర్త ఎం.విజయనిర్మల అధ్యక్షతన బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బాపట్ల, చీరాల సబ్ డివిజన్‌లోని 8 మండలాలకు సంబంధించిన వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులకు ఒకరోజు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాపట్ల ఉప్పునీటి పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ మదువాణి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించి వాటి ఆధారంగా సిఫార్సు మేరకు ఎరువులు వినియోగించాలన్నారు. బాపట్ల వరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి మాట్లాడుతూ వరిలో వచ్చే పురుగులు, తెగుళ్ళపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాది కులస్థులకు ఆధార్ ప్రత్యేక శిబిరం

బాపట్లరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యానాది కులస్థులకు ఆధార్‌కార్డు సమస్య లేకుండా ప్రత్యేక శిబిరాన్ని బాపట్ల మండలం ఈస్ట్‌బాపట్ల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. సెక్రటరి మాట్లాడుతూ యానాది కులస్థులకు ఆధార్‌కార్డులను నూరుశాతం జారీ చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించటం జరిగిందని, అందులో భాగంగా బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు తహసీల్దార్ షేక్ సలీమా, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని మండలంలోని యానాదికులస్థులకు ఆధార్‌కార్డు సమస్య లేకుండా ప్రత్యేకశిబిరాలను నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షణ్ముఖరావు, డాక్టర్ సాంబశివరావు, రమేష్, డిజిటల్ అసిస్టెంట్‌లు నాగేశ్వరరావు, నాగాంజనేయులు, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెరువుజమ్ములపాలెం గ్రామసమీపంలోని పజేటికాల్వలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకు రావటంతో గ్రామస్తులు బాపట్లరూరల్ పోలీసులకు సమాచారం అందించారు. చెరువుజమ్ములపాలెం వీఆర్వో సమక్షంలో బాపట్లరూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మృతదేహం పురుషుడిగా గుర్తించటం, సుమారు వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. వీఆర్వో తెలిపిన వివరాలు ప్రకారం కేసు నమోదు చేయటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.

రేపు లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్యశిబిరం

రేపల్లె,నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరుపాలెంలో ఉన్న గట్టిపాటి కళ్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షులు అమిరినేని సత్యన్నారాయణ తెలిపారు. తీరప్రాంతంలోని పేదలకు ఉచితవైద్యం అందించాలనే లక్ష్యంతో విజయవాడ లయన్స్ క్లబ్, క్యాపిటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసీజీ, షుగర్, రక్తపోటు పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులను అందిస్తారని తెలిపారు.


రోడ్లపై ఆవులను శ్రీశైలం గోశాలకు తరలిస్తాం

రేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లపైకి ఆవులను వదిలేస్తే వాటిని శ్రీశైలంలోని గోశాలకు తరలిస్తామని ఈ విషయాన్ని ఆవుల యజమానులు గమనించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు తెలిపారు. ఆవుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ ఇళ్ళ వద్దే కట్టుకోవాలని సూచించారు.

మినుము పంట పరిశీలన

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల్లో సాగవుతున్న మినుము పంటను మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పెదలంక, ఈపూరులంక తదితర లంక గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మినుము పంటను ఏవో పరిశీలించి ఎక్కడా పల్లాకు తెగులు సోకిన ఆనవాళ్ల కనిపించలేదన్నారు. పంటకు నీరు పెట్టిన సమయంలో ఎక్కడైనా నీరు నిలిచిన చోట మాత్రమే ఆకులు పసుపు రంగుకు మారినట్లు గుర్తించామన్నారు.

మత్స్యకారుల భృతిని త్వరితగతిన ఇవ్వండి



షర్మిలకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ ఫిషర్‌మ్యాన్ కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ నాగబాబు

రేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు సముద్రతీర ప్రాంతంలో 970 కిలోమీటర్లలో సముద్రవేట కొనసాగిస్తున్నారని, విరామ సమయంలో వారికి ఇచ్చే భృతిని కూటమి ప్రభుత్వం నేటికి అందించలేదని ఏపీ ఫిషర్ మ్యాన్ కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ కొవనాతినాగబాబు అన్నారు. ఈ విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నించి మత్స్యకార భృతిని కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఆయన వినతిపత్రం అందజేశారు. విజయవాడలో శుక్రవారం ఆమెను కలిశారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో మత్స్యకార భృతి కింద మత్స్యకారులకు రెండు నెలల వేట నిషేదకాలంలో రూ.10 వేలు ఇచ్చేవారని గుర్తుచేశారు. మత్స్యకార భృతి కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ కూటమి, ఆ హామీని మరిచిందని విమర్శించారు. వేట విరామసమయం అయిపోయి నాలుగు నెలలు గడుస్తోందని, తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు.

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఎంపీపీ రావూరి వెంకటలలితకుమారి శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే సమావేశానికి మండల పరిధిలోని జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొనాలని కోరారు.

మద్యం అక్రమ అమ్మకాలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

చుండూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి శుక్రవారం తెలిపారు. వేటపాలెంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్లు అందిన సమాచారంతో నిఘా ఉంచి దాడి చేయగా అతని వద్ద 8 మద్యం బాటిల్స్ లభించాయని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు రూ.3 లక్షలను బాధిత కుటుంబానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం అందజేశారు. మండల పరిధిలోని పాంచాళవరం గ్రామానికి చెందిన లాం సరళ గుండె సర్జరీ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి వేమూరు ఎమ్మెల్యే ద్వారా సిఫార్సు లెటరును అందజేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేస్తూ చెక్కును పంపారు. ఈ చెక్కులు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, పాంచాళవరం సర్పంచ్ పావులూరి హేమచంద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని పోతార్లంక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మద్దూరి సుబ్బారావు, అదే గ్రామానికి చెందిన లంకె లక్ష్మీ అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం గ్రామానికి వెళ్లి ఆయా కుటుంబాల సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దిండి అదవలలో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేమని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలంలోని దిండి అదవల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నాటుసారా తయారుచేసే బట్టీలను ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ 1500 లీటర్ల బెల్లం ఊటను, రెండు సారా బట్టీలను ధ్వంసం చేశామని తెలిపారు. నాటుసారా ప్రజల ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వం నిషేదించిన సారాను తయారు చేసిన వారిపై, విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లాన్ని విక్రయించే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల నివారణ కోసం 33 కేవీ రేపల్లె, 33కేవీ గంగడిపాలెంలో ఫీడర్స్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతుల కారణంగా రేపల్లె పట్టణం, మండలాల్లోని అన్ని గ్రామాల్లో విద్యుత్‌సరఫరా అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల ఏఈలు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కొల్లూరులోని రావికంపాడు ఫీడర్‌పై ఉన్న గాంధీనగర్, బోస్‌నగర్, క్రాప, రావికంపాడు, తాడిగిరిపాడు, కుచ్చెళ్లపాడు, అబ్బనగూడవల్లి గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కుర్రా సుధాకరబాబు తెలిపారు. భట్టిప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ శాంతకుమారి తెలిపారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, చందోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహించటం వలన శనివారం సరఫరాలో అంతరాయం జరుగుతుందని పిట్టలవానిపాలెం విద్యుత్‌శాఖాధికారి కె.చంద్రశేఖరరావు తెలిపారు.

నేడు సీపీఎం మహాసభలు

రేపల్లె,నవంబరు8(ఆంధ్రజ్యోతి):నిత్యం ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించే సీపీఎం రేపల్లె పట్టణ 2వ మహాసభలను శనివారం నిర్వహించనున్నట్లు పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ తెలిపారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మైనేని సీతారామయ్య కళ్యాణమండపంలో ఈ మహాసభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, కార్యవర్గ సభ్యులు సీహెచ్ గంగయ్య, జిల్లా కార్యదర్శి టీ కృష్ణమోహన్, జిల్లా కమిటి సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు.

మూసపోసిన వ్యవసాయానికి వారు స్వస్తి పలికారు. దీర్ఘకాలిక సాగు.. బరువైన పెట్టుబడులు పెట్టాల్సిన పంటలు వద్దనుకొని కూరగాయల బాట పట్టారు. కేవలం 45 రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేస్తూ మూడు రాష్ట్రాలకు కూరగాయలు సరఫరా చేస్తున్నారు. నూతన పంథాలో పెట్టుబడులు పోగా అంతో ఇంతో వెనకేసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదీ గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల రైతుల విజయగాథ.



మూడు రాష్ట్రాలకు కూరలిస్తున్నారు !

● వేజెండ్ల రైతుల విజయప్రస్థానం

- రకం ఏదైనా వినూత్నంగా కూరగాయలుసాగు
- దొండ, చిక్కుడు, దోస, బీర, బెండల్లో అధిక దిగుబడులు
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇక్కడ కూడా అందరూ పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు వేసి చేతులు కాల్చుకున్నవారే. తెగుళ్లు ఎక్కువ కావటంతో ఆయా పంటల సాగు లాటరీగా మారిన వేళ ప్రత్యామ్నాయం వైపునకు అడుగులు వేశారు. చిన్నగా కూరగాయల సాగు ఆరంభించారు. మొదట్లో పది ఎకరాలతో కొత్త సాగు ఆరంభం అయింది. గ్రామ పరిధిలో ఉన్న సుమారు 1800 ఎకరాల సాగు భూమిలో ప్రస్తుతం చాలా వరకు కూరగాయలు, వరి పండుతున్నాయి. పంటల మార్పును సవాలుగా తీసుకున్న గ్రామ ఆదర్శ రైతులు కూరగాయ విత్తనాలు, నారు, అంట్లు ఎక్కడ బాగుంటాయో విచారించి తెలుసుకొని మరీ వాటిని తీసుకొచ్చి సాగు చేశారు. దొండ అంట్లు(మొక్కలు)కోసం గుజరాత్, బెంగాల్ వరకు వెళ్లి వస్తున్నారంటే సాగు మీద వారికున్న శ్రద్ధను అర్థం చేసుకోవచ్చు.

ఏడాది పంటే కానీ...

ఇక్కడి రైతులు ఎక్కువగా సాగుచేసే కూరగాయల పంటలో మరొకటి కనుప చిక్కుడు ఒకటి. దాన్ని పెద్ద చిక్కుడు అని కూడా అంటారు. రాజమహేంద్రవరం సమీపంలోని రావులపాలెం నుంచి విత్తనాలు తెచ్చి సాగుచేస్తారు. కట్టే, కాపు వెరైటీ ఇక్కడ ఎక్కువగా సాగు చేస్తున్నారు. పందిరి వేసి తీగను పాకిస్తారు. మే, జూన్ తప్ప అన్ని రోజులు కాపు వస్తుంది. ఇక్కడ జనవరి నెలలో పండే మంచి చిక్కుడుతోనే ఊరగాయ పచ్చడి కూడా పెడతారు. చిక్కుడు ఎకరానికి అల్లు పెట్టించే వరకు సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఆ తర్వాత తెగుళ్ల నివారణకు పైమందులు అధికంగానే పిచికారి చేయాలి. మొత్తం పెట్టుబడి రూ. 1.20 లక్షల వరకు అవుతుంది. ఎకరానికి 200 బస్తాలు(ఒక్కో బస్తా 55 కేజీల నుంచి 60 కేజీల) వరకు దిగుబడి వస్తుంది. ఇందులో కొన్ని వెరైటీలు కేవలం ఆరు నెలలు మాత్రమే పంట కాలం. అయితే చిక్కుడు ధర సంవత్సరం పొడవునా రూ.30 నుంచి రూ.120 వరకు ఉంటుంది కాబట్టి రైతుకు కలిసొస్తుంది. ఈ గ్రామంలో ఇవి గాక టమాట, దోస, బీర, బెండ, కాకర, సొర, పొట్ల కాయ వంటి కూరగాయలు సంవత్సరం పొడవునా పండుతూనే ఉంటాయి.

వేజెండ్లలో చిక్కుడు సాగు



వేజెండ్లలో పందిళ్లు వేసిసాగు చేస్తున్న దొండ తోట



ఒకసారి వేస్తే రెండేళ్లు వరకు పంట

వేజెండ్ల రైతులు ప్రస్తుతం సాగుచేస్తున్న దొండ పంటకు పెట్టుబడి ఎకరాకు రూ. 2.50 లక్షల వరకు అవుతుంది. అయితే ఒకసారి అంటు నాటితే అది రెండేళ్ల వరకు పంటనిస్తూనే ఉంటుంది. దొండలో రెండు రకాలు ఉన్నాయి. లావు దొండ, సన్న దొండ. లావు దొండలో రెండు రకాలు, సన్న దొండలో నాలుగు రకాల అంట్లు ఉన్నాయి. కొంత శ్రమతో కూడుకున్నదే అయినప్పటికీ 45 రోజుల నుంచి 60 రోజుల వ్యవధిలో కాపు చేతికి వస్తుంది. ప్రతి కోతకు ఎకరానికి 35 నుండి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. వేసవి ఎండలు ఉధృతంగా ఉండే ఏప్రిల్, మే నెలలు తప్ప మిగిలిన అన్ని రోజుల్లో దొండ కాయ కాపు రైతుకు లాభ సాటిగానే ఉంటుంది. సీజన్ బట్టి ధర కాస్త అటూ ఇటూ అయినా అంతిమంగా పెట్టిన పెట్టుబడికి నష్టం అయితే రాదని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లు తట్టుకోలేక ఇటువైపు అడుగులు

గవిని హరికృష్ణ, రైతు,వేజెండ్ల



మిరపలో తెగుళ్లు ఎక్కువయ్యాయి. వాటిని తట్టుకోలేక కూరగాయల సాగు వైపు అడుగులు వేశాం. ఈ సాగు బాగానే ఉంది. నష్టం అయితే రాదు. అదృష్టం బాగుంటే రూపాయి కలుస్తుంది. లేకుంటే కూలి మందం మిగులుతాయి. నేను చాలా సంవత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. తెగుళ్లు ఇందులో కూడా వస్తాయి. ఎక్కువగా గమనించి జాగ్రత్త పడతాము. గుజరాత్, బెంగాల్ వెరైటీలు తెస్తాము.

నష్టం అయితే రాదు

శనగల వీరారెడ్డి, రైతు, వేజెండ్ల



కూరగాయల సాగు వల్ల పెద్దగా నష్టం వాటిల్లదు. ఒక సీజన్‌లో కాకపోయినా మరో సీజన్‌లో రూపాయి వస్తుంది. పెట్టిన పెట్టుబడికి దిగులుండదు. ఈ ఏడాది సాగు బాగానే ఉంది. దీంతో రైతులకు ఆదాయం ఒకింత బాగానే ఉంది. మార్కెట్‌లో రేట్లు బాగానే ఉన్నాయి. చిక్కుడు వెరైటీ కేజీ రూ. 100కి ధర తగ్గలేదు. దొండకు కూడా మంచి ధర వచ్చింది. వర్షాలకు మొదట కొంత ఇబ్బంది కలిగినా ఇప్పుడు పర్వాలేదు.



నారాకోడూరు కమీషన్ కొట్లు వద్దకు తరలించిన కూరగాయలు

నారాకోడూరు నుంచే సరఫరా...

వేజెండ్లతో పాటు మిగిలిన గ్రామాల్లో పండించిన కూరగాయల పంటను రైతులు నారాకోడూరులో కమీషన్ వ్యాపారుల వద్దకు చేరుస్తారు. ట్రాలీ ఆటోలు, ద్విచక్ర వాహనంపై కూరగాయలను కమీషన్ కొట్లకు చేరుస్తారు. అక్కడ వ్యాపారులు వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని సుమారు 60 మార్కెట్ల కు పంపుతారు. ఇక్కడ కూరగాయలు దిగుబడి తగ్గిందంటే ఆయా రాష్ట్రాల్లో ధరలు ఆసాంతం పెరిగిపోతాయి.

అనేక గ్రామాలకు ప్రేరణ..

వేజెండ్ల రైతులు పంటల మార్పునకు నడుం బిగించిన తర్వాత మండలంలోని మరికొన్ని గ్రామాలు కూడా అదే బాటపట్టాయి. నారా కోడూరులో చాలా కాలంగా కూరగాయలు ఉన్నప్పటికీ సుద్దపల్లి, గుండారం, గొడవర్రు, చేబ్రోలు రెడ్డిపాలెంలో మాత్రం కొన్నేళ్లుగానే ఉంది.

అనువైన భూమి..

మండలంలోని కూరగాయలు సాగుకి అక్కడి భూములు ఎంతో అనువైనవని రైతులు చెబుతున్నారు. నల్లపొలాలు కావటం, ఒండ్రు ఎక్కువగా ఉండటంతో కూరగాయల వేర్లు భూమి లోపల మూడు, నాలుగు అడుగుల వరకు వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. భూమి అనువైనది కావడం తోనే తాము పత్తి, మిరపకు స్వస్తి పలికి కూరగాయల సాగుకు సిద్ధం అయినట్లు చెబుతున్నారు.

వచ్చిన చోటికే రజినీ !



- చిలకలూరిపేటకు విడదల రజనీ
- తాడికొండకు బాలవజ్రబాబు
- రెండు నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- సుచరిత స్థానంలో డైమండ్‌బాబుకు ఛాన్స్
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీలో తాజా పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' వెలువరించిన కథనాలు అక్షర సత్యాలయ్యాయి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంనుంచి ఓటమి చవి చూసిన మాజీ మంత్రి విడదల రజనీ తిరిగి చిలకలూరిపేటకు వెళుతుందని ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నిజమైంది. అలానే గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిన మాజీ హోం మంత్రి సుచరిత కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఏకంగా ఆ పార్టీ అధినేత జగన్‌తోనే చెప్పినట్లు కూడా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి మాజీ మంత్రి విడదల రజనీని, ఎస్సీ రిజర్వు తాడికొండ నియోజకవర్గానికి వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు)ను సమన్వయకర్తలుగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి విడదల రజనీ 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. దాంతో ఆమె తిరిగి సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటకు వెళ్లాలని, అక్కడైతేనే తనకు అనుకూల పరిస్థితులుంటాయని ఇటీవల అధినేతతో చెప్పినట్లు సమాచారం. దాంతోనే ఆమెను తిరిగి చిలకలూరిపేటకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. టీడీపీ కంచుకోట అయిన పశ్చిమ నియోజకవర్గం కంటే చిలకలూరిపేటకు వెళ్లాలని రజని భావిస్తున్నారని, అధిష్టానం కూడాపేటకు పంపే ప్రయత్నం చేస్తుందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రజనీ పీచేముడ్' పేరుతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే అంశం ఇప్పుడు నిజమైంది. మరో వైపు నగర డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తున్న డైమండ్‌బాబును ఇటీవల వైసీపీ నగర అధ్యక్షుడుగా నియమించారు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన తాడికొండ నియోజకవర్గానికి డైమండ్‌బాబుకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. కాగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు ఎవరికిస్తారనేది ఆ పార్టీలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పశ్చిమ నియోజకవర్గంపై ఇప్పటికే నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కన్నేశారు. 2024 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి బరిలో దిగిన మేయర్ కావటి మనోహర్ ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. అయితే సొంత నియోజకవర్గమైన పశ్చిమ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించాలని స్వయంగా అధినేత జగన్‌ను మేయర్ అడిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు అధినేత ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



డైమండ్ బాబు

ఆదివాసి యువకులను విడుదల చేయాలి

● ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుల డిమాండ్

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలను చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సాయుధ రిజర్వుడు పోలీసులు శుక్రవారం ఉదయం 9 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని వారిని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. బీజాపూర్ పోలీసులు పెట్రోలింగ్ సమయంలో అనుమానంతో ఈ అక్రమ నిర్బంధానికి పాల్పడ్డారన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ ప్రాంతంలో యువకులను సీపీఐ (మావోయిస్టు)ల పేరిట కాల్చి చంపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో యువకుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. ఈ అక్రమ నిర్బంధం పట్ల పరిసర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఈ చర్యల పట్ల తమ తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరసన ర్యాలీకి మద్దతుగా నంబి నుంచి కొండ పాలికి వెళుతున్న వారిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారన్నారు. రాత్రి సమయం కావడంతో గుండిర్‌గూడలో నిద్రిస్తున్నవారిని కూడా వదిలి పెట్టకుండా పోలీసులు ఈ అక్రమ అరెస్టుకు పాల్పడ్డారన్నారు. ఈ అరెస్టును పోలీసులు ధ్రువీకరించక పోవడంతో మంచ్ కార్యకర్తల కుటుంబసభ్యులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ విధంగా పోలీసులు అక్రమంగా పట్టుకున్న వారిలో అర్జున్ సోధి, ముయా హేమ్లా , నగేష్ బడ్సే, జోగా మీడియం, గీల్లు కాటం, భీమా కుంజం తదితరులు ఉన్నారని పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్యకర్తలకు ప్రాణహాని తలపెట్టకుండా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వీ.చిట్టిబాబు, రాష్ట్ర కార్యదర్శి చిలుకాచంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు

● 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేటరూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ పరిధిలో మోటారుసైకిళ్లను దొంగిలిస్తున్న ముఠా సభ్యులను నరసరావుపేట రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పంచాయతీలోని బైపాస్ వద్ద నరసరావుపేట రూరల్ ఎస్ఐ, సిబ్బంది నిందితులను పట్టుకున్నారని తెలిపారు. వీళ్లు ఇళ్ల ముందు, బార్‌ల ముందు నిలిపివుంచిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తుంటారని తెలిపారు. ఇలా ఈ ముఠా దొంగిలించిన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పల్నాడుజిల్లాలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని, నరసరావుపేట పట్టణంలో గంజాయి, మెడికల్ మాఫీయా, పెస్టిసైడ్ మాఫీయా, పాలల్లో కల్తీ వంటి వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎప్పుడైనా దాడులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వాహనదొంగలను పట్టుకొన్న రూరల్ సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

వికసిత్ భారత్‌తో స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- నూతన ఆవిష్కరణలతో ముందుకు రండి
- మన దేశంలో ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



వికాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తుళ్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఉంటుందనీ, నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏపీ విశ్వవిద్యాలయంలో వికాస్ (వీఐటీ ఇన్నోవేషన్ నాలెడ్జ్ అక్విజిషన్ సమ్మిట్) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ నిర్వహిస్తున్న వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. ఈ వేదిక పరిశ్రమ ప్రతినిధులు, అధ్యాపకులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఒక్కటి చేసి అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలియజేశారు. సహకార పరిశోధన సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా దేశాభివృద్ధికి పునాది పడుతుందని అన్నారు. 2024కు ముందు భారత దేశంలో అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్‌లుండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలున్నాయన్నారు. యూనికాన్ నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1100 ఉన్నాయని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో చర్చించిన అనంతరం స్టార్టప్స్‌పై విద్యార్థులకు ఉన్న సందేహాలను మంత్రి పెమ్మసాని నివృత్తి చేశారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో ఒప్పందాలు చేసుకుంటున్న 17 మంది పరిశ్రమల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర విశ్వనాథన్, శేఖర్‌విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ ఎస్వీవీ.కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, వికాస్ కన్వీనర్ అమిత్ చవాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలు

● జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గుంటూరు, బాపట్లజిల్లాలకు చెందిన ఎంపీడీవోలు ,ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ షీలా పద్మరాణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత స్థానిక స్వపరిపాలన సంస్థలపై ఉందని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా సంస్థలు పరిష్కరించాలని ఆమె కోరారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామాల్లో అన్నిశాఖల ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందిస్తారని పంచాయతీ రిసోర్స్‌మెంటార్, జిల్లాకోఆర్డినేటర్ షీలా పద్మరాణి తెలిపారు. గ్రామస్థాయిలో జనవరిలో, మండల స్థాయిలో ఫిబ్రవరి, జిల్లాస్థాయిలో మార్చి ఆఖరులోగా ప్రణాళికలద్వారా రూపొందించిన కార్యక్రమాలు పూర్తిచేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో నాగ సాయికుమార్, జేడీ కేశవరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వీ.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో పీహెచ్‌కృష్ణ, డాక్టర్‌కూచిపూడి మోహన్ రావు, కే.జియాబేగం, జిల్లాపంచాయతీ వనరుల కేంద్రం జిల్లా శిక్షణ మేనేజర్ కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బొమ్మ వదిలింది..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో పాతిన హద్దురాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపేయాల్సిందిగా రెవెన్యూ శాఖకు సూచించింది. దీంతో వారం, పది రోజుల వ్యవధిలోనే హద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. ఇందు కోసం శాండ్ వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తుంది. ఇది ఒకవేళ ఖర్చుతో కూడుకొనేట్లయితే మాన్యువల్‌గా చేసే వారికి పనిని అప్పగించాలని యోచిస్తున్నది.

- సర్వే హద్దురాళ్లపై జగన్ చిత్రం తొలగింపునకు శ్రీకారం
- రీసర్వే జరిగిన గ్రామాల్లో దాదాపుగా
- 84 వేల రాళ్లు పాతిన గత వైసీపీ ప్రభుత్వం
- 62 గ్రామాల్లో కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభం
- రూ. 12.50 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం



గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే కార్యక్రమానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమలులోకి తీసుకొచ్చింది. గుంటూరు జిల్లాలో తొలుత ఐదు గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఆ తర్వాత మరికొన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. సాధారణంగా ఏవైనా భూముల సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎలాంటి పేర్లు, బొమ్మలు వేయదు. అలానే టైటిల్ డీడ్ పైనా భూహక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అలాంటిది వైసీపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫోటోలను ముద్రించింది. మరోవైపు భూముల హద్దురాళ్లపై జగన్ ఫోటోలు, పేర్లు, వైసీపీ రంగులను అద్దింది. దీనిపై పలువురు భూయజమానులు అభ్యంతరం పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్ డీడ్, హద్దురాళ్లపై ఫోటోలు చూస్తే అవి జగన్‌కు చెందిన ఆస్తులన్నట్లుగా చిత్రీకరణ జరిగింది. ఎన్నికలకు ముందు తెలుగుదేశంతో పాటు బీజేపీ, జనసేన పార్టీలు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి. మీ ఆస్తులపై జగన్ ఫోటోలు, పేర్లు ఏమిటి. మళ్లీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా/తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని హెచ్చరించాయి. దాంతో ప్రజల్లో ఒక చర్చ జరిగింది. తమ భూములను లాక్కొంటారన్న భయం ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో 83,770 హద్దురాళ్లను పాతినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ఒక్కో హద్దురాయికి రూ. 15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లను నిర్వహించి కాంట్రాక్టర్‌ని ఎంపిక చేస్తారు. కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.